సమయపాలన పాటించని అధికారులు

మధ్యాహ్నం 12:15 గంటల వరకు ఖాళీగా ఉన్న తహసీల్దార్ కుర్చీ

రిజిస్ట్రేషన్ కోసం తహసీల్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

పెంబి, మార్చి 6: నిర్మల్ జిల్లా పెంబిలోని తహసీల్ కార్యాలయంలో సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. మందపల్లి గ్రామానికి చెందిన గుండవేణి భీమరాజు, గుండవేణి శేఖర్ గిప్టుడీడ్ కింద తన తండ్రి నుంచి భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి స్లాట్ బుక్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఉదయం 10 గంటలకు తహసీల్ కార్యాలయానికి వచ్చారు. అధికారుల రాక కోసం ఎదురు చూస్తు కూర్చున్నారు. డిప్యుటీ తహసీల్దార్ శంకర్, ధరణి ఆపరేటర్ సెలవులో ఉన్నారని ఆర్ఐ శ్రావణ్ తెలిపారు. తహసీల్దార్ లక్ష్మణ్ మధ్యాహ్నం 12:15 గంటలకు కార్యాలయానికి వచ్చారు. భూమి రిజిస్ట్రేషన్ చేయాలని గుండవేణి భీమరాజు, గుండవేణి శేఖర్ తహసీల్దార్‌ను కోరారు. ధరణి అపరేటర్ సెలవులో ఉన్నారని అతను లేకుండా రిజిస్ట్రేషన్ చేయడం వీలుకాదని చెప్పడంతో సాయంత్రం 3 గంటల వరకు ఎదురుచూసి తిరిగి వెళ్లిపోయారు.

న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తాం

మాట్లాడుతున్న సంఘం గౌరవాధ్యక్షుడు రాజన్న

ఎదులాపురం, మార్చి 6: కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన(సీసీఐ) సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు తక్కువ ధరకే అప్పుడు భూములను కొనుగోలు చేశారని, ప్రస్తుతం ఉన్న బీజేపీ ప్రభుత్వం భూ నిర్వాసితులకు న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తామని సీసీఐ భూ నిర్వాసితుల సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం ఆదిలాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీసీఐ భూ నిర్వాసితుల సంఘం గౌరవాధ్యక్షుడు రాజన్న మాట్లాడారు. 1979వ సంవత్సరం ఆదిలాబాద్‌కు అనుకొని ఉన్న బెల్లూరి, లాండసాంగ్వి, ఆదిలాబాద్ మొదలగు గ్రామాల సాగు భూములలో సర్వే గావించి, సున్నపురాయి నిలువలు పుష్కలంగా ఉన్నాయని ఇక్కడ రైతుల నుంచి 779 ఎకరాల సాగు భూములకై అప్పటి కేంద్ర ప్రభుత్వ పరంగా నామమాత్రపు నష్ట పరిహారం ఇచ్చిందన్నారు. రైతులకు వంద సంవత్సరాల వరకు ఉపాధి అవకాశాలు, పరిశ్రమలో ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. లాభాలలో ఉన్న ఈ పరిశ్రమను 1998లో మూసి వేసిందని తెలిపారు. అందులో పని చేస్తున్న భూ నిర్వాసితులను కూడా బలవంతపు వీఆర్ఎస్ స్కీమ్‌ను తీసుకువచ్చి ఉద్యోగ విరమణ చేయాల్సిందగా బలవంతపు బెదిరింపులకు పాల్పడ్డారు. అలాగే మిమ్మల్ని ఇతర రాష్ట్రాల్లో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీలకు బదిలీ చేస్తున్నట్లు నకిలీ ఉత్తర్వులు వెలువరిస్తూ భయపెట్టి వీఆర్ఎస్ తీసుకునేటట్లు చేసి ఆ ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడారు. చివరికి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ పరిశ్రమ స్క్రాప్ కింద అమ్ముకోవడానికి యాజమాన్యం కేంద్ర ప్రభుత్వం అనుమతితో టెండర్ ప్రక్రియని కొనసాగిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా మార్చి 7 ఆన్‌లైన్‌లో తెలియపరిచిందన్నారు. సమావేశంలో అధ్యక్షుడు అరవింద్, సభ్యులు ఈశ్వర్ దాస్, రాంరెడ్డి, కృష్ణ, విఠల్, మహేందర్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు అందేలా చర్యలు చేపడుతాం

చింతకర్రలో గ్రామస్తులతో మాట్లాడుతున్న మిషన్ భగీరథ అధికారులు

బజార్‌హత్నూర్, మార్చి 6: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని చింతకర్ర గ్రామంలో అందని భగీరథ నీరు..బావి నీరే దిక్కు గురువారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి నీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఎత్తు ప్రదేశంలో చింతకర్ర గ్రామం ఉండడంతో ట్యాంకులో నీళ్లు నిండే వరకు సమయం పడుతుందని కావున పూర్తి స్థాయిలో ట్యాంకు నింపి గ్రామానికి సరిపడా నీళ్లను అందిస్తామని గ్రామస్తులతో తెలిపారు. ముందు ముందు గ్రామస్తులకు నీటి సమస్యలు రాకుండా చూస్తామని పేర్కొన్నారు. ఇక్కడ గ్రీడ్ డీఈ రమకాంత్, ఏఈ ఉమేశ్, సూపర్‌వైజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

శనగలు కొనుగోలు చేయకపోతే ఆందోళన చేస్తాం

జైనథ్, మార్చి 6: ఆదిలాబాద్ జిల్లా జైనథ్, బేల మండలాల్లో రైతులు పండించిన శనగ పంటను కొనుగోలు చేయకపోతే ఆందోళనను తీవ్రం చేస్తామని రైతు బంధు సమితి మండల మాజీ కోఆర్డినేటర్ లింగారెడ్డి, మాజీ ఎంపీపీ ఎం గోవర్ధన్ అన్నారు. గురువారం జైనథ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాల్సిన శనగను ఇప్పటి వరకు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. శనగ పంటను తక్షణం కొనుగోలు చేయకపోతే రైతుల పక్షాన మండల తహసీల్ కార్యాలయంతో పాటు జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గణేశ్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

బోథ్, మార్చి 6 : జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీలో పని కల్పించాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని ధన్నూర్(బీ), అందుర్ గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీల హాజరు శాతాన్ని సూచించే మస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పనులు చేయాలని సూచించారు. ఆయన వెంట టీఏ నరేశ్, ఎఫ్ఏ దూద్‌రాం ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

కుంటాల, మార్చి 6: నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని పైలట్ గ్రామమైన విట్టాపూర్‌లో 35 ఇండ్లు మంజూరు కాగా గురువారం అధికారులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ అధికారి రాజేశ్వర్, డీఈఈ దయానంద్, ఏఈ సవేరామ్, ఎంపీడీవో లింబాద్రి, పంచాయతీ కార్యదర్శి ఉత్తమ్, మాజీ సర్పంచ్ లక్ష్మీ రమేష్, పంచాయతీ కారోబారి లక్ష్మణ్, ఫీల్డ్ అసిస్టెంట్ సుదర్శన్, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుకు స్థల పరిశీలన

నార్నూర్, మార్చి 6 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయ ప్రాగంణంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుకు గురువారం గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ డీఈ శివ ప్రసాద్ తహసీల్దార్ జాడి రాజాలింగం స్థలాన్ని పరిశీలించారు. ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. వారి ఐటీడీఏ ఏఈ రాథోడ్ సునీల్ ఉన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

నార్నూర్, మార్చి 6 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ గురువారం తనిఖీ చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ జాడి రాజాలింగం, సీవో కేవీ కేశవులు, డీవో స్వర్ణ ఉన్నారు.

ఆర్ఐగా నవత జ్యోతి

నర్సాపూర్(జీ), మార్చి 6 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ) తహసీల్ కార్యాలయంలో గురువారం ఆర్ఐగా నవత జ్యోతి బాధ్యతలు స్వీకరించారు. దస్తురాబాద్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన ఆమె బదిలీపై వచ్చారు. ఇక్కడ ఆర్ఐగా పని చేసిన వేణుగోపాల్ తానూర్‌కు బదిలీపై వెళ్లారు. నవత జ్యోతిని తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది సన్మానించారు.

31లోగా రుసుము చెల్లించాలి

ఎదులాపురం, మార్చి 6 : ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుము ఈ 31వ తేదీలోపు చెల్లించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లింపులు, ఇతర అంశాలపై గురువారం ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎల్డీపీఎస్ ఇంజినీర్స్, రియల్ ఎస్టేట్ డెవలపర్స్, దస్తావేజు లేఖరులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డీపీఆర్‌వో తిరుమల, అధికారులు పాల్గొన్నారు.

పద్మశాలీ మహాసభను విజయవంతం చేయాలి

బోథ్, మార్చి 6: హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న పద్మశాలీ మహాసభలను విజయవంతం చేయాలని బోథ్ పట్టణ శాఖాధ్యక్షుడు అసాల సదాశివ్ పిలుపునిచ్చారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని మార్కండేయ ఆలయ ఆవరణలో మహాసభకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో పట్టణ శాఖాధ్యక్షుడు మెరుగు భోజన్న, పద్మశాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

నిర్మల్ అర్బన్, మార్చి 6:శిక్షణలో నేర్చుకున్న అంశాలతో బాధ్యతగా విధులు నిర్వహించాలని నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి అన్నారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ఆదేశాల మేరకు నిర్మల్‌లో నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఉద్యోగులలో నైపుణ్యాలు, సృజనాత్మకతను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేయనున్నాయని సూచించారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, నవీన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 6: నియమ నిబంధనలు పాటించని స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి రాజేందర్ అన్నారు. నిర్మల్‌లోని పలు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. ఇక్కడ కార్యక్రమ నిర్వహణ అధికారి సౌమ్య, రవీందర్ ఉన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 6 : పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం నిర్మల్ కలెక్టర్ సమావేశమందిరంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో పదో తరగతి పరీక్షలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో జిల్లాలోని ప్రతి పాఠశాలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆదేశించారు. రెండు సంవత్సరాలుగా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లా మొదటి స్థానంలో నిలుస్తూ వచ్చిందని ఈ సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు పాఠాలను సులభంగా గుర్తించుకునే విధంగా మెలకువలు నేర్పించాలన్నారు. సబ్జెక్టుల వారిగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులచే వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రామారావు, ఎంఈవోలు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీల ప్రత్యేకాధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పన్నులు చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

అంబేద్కర్‌నగర్‌లో ఇంటిని సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

ఖానాపూర్, మార్చి 6: ప్రజలు ఇంటి, వ్యాపార పన్నులు సకాలంలో చెల్లించని వారిపై మున్సిపల్ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ హెచ్చరించారు. గురువారం నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని అంబేద్కర్‌నగర్ కాలనీలో ఏండ్ల తరబడి పన్నులు చెల్లించని ఒక ఇంటిని అధికారులు సీజ్ చేశారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి వివిధ రకాల పన్నులు రూ.2.18 కోట్లు వసూలు చేయలన్న లక్ష్యంతో అధికారులు ప్రణాళికతో పన్నులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు రూ. 81.63 లక్షలు పన్నులు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని 12 వార్డులకు గాను అధికారులు 4 బృందాలుగా ఏర్పడి పన్నుల వసూలు చేస్తున్నట్లు వివరించారు. పన్నులు చెల్లించడంలో తీవ్ర జాప్యం చేసిన 200కు పైగా పట్టణ వాసులకు రెడ్ నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని కోరారు. ప్రజలు విధిగా మున్సిపల్ అధికారులకు లేదా పురపాలక సంఘ కార్యాలయానికి వచ్చి తమ ఇంటి, వ్యాపార పన్నులను చెల్లించాలని సూచించారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

మాట్లాడుతూన్న కలెక్టర్, ఎస్పీలు

ఎదులాపురం, మార్చి 6 : పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలి ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులతో పాటు ఎస్పీతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12: 30 గంటల వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ గూడ్స్, గడియారాలు, తదితర పరికరాలు అనుమతించబడవని స్పష్టం చేశారు. పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడంలో చీఫ్ సూపరింటెండెంట్లు ప్రధాన బాధ్యత వహించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, వాటిలో మొత్తం 10,106 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ ప్రశ్నపత్రాలను భద్రపరిచేందుకు 14 కేంద్రాలలో పోలీస్ స్టేషన్లలో ఏర్పాట్లు, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కేంద్రం వద్ద అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఆశకార్యకర్తలు, ఏఎన్ఎంలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని , పరీక్ష సమయాలను దృష్టిలో పెట్టుకొని బస్సులను నడిపించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు సరైన సమయంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సులు నడపాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసేందుకు వీలుగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్లను నియమించినట్లు కలెక్టర్ తెలపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు చూడాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో మహిళా కానిస్టేబుల్ ఉండేలా చూసుకోవాలని, అధికారులు సమన్వయంతో పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గంజాయిని కలిసికట్టుగా అరికడదాం

ఎదులాపురం, మార్చి 6: గంజాయిని కలిసికట్టుగా అరికడదామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదిలాబాద్ కలెక్టర్ కాన్ఫరెన్స్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మాదక ద్రవ్యాల నిర్మూలనకై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సమష్టిగా కృషి చేయడం వల్ల మాదక ద్రవ్యాలు, గంజాయిని నిర్మూలించవచ్చని తెలిపారు. ప్రతి కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి, పోలీసు, తల్లిదండ్రులు విద్యార్థులు, అధ్యాపకులు కమిటీలో ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు ప్రతి వారం గంజాయి, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ చైతన్యపరచాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయి పండించిన, వాడిన చట్టపరమైన కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ, పోలీసు, మెడికల్, కళాశాల అధ్యాపకులు, ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో రోడ్ సేఫ్టీపై ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ జిల్లాలోని రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ గుర్తించాలని, ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి వివిధ రకాల చర్యలను చేపడుతూ ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలైన హాట్‌స్పాట్‌లను గుర్తించి ఆ ప్రదేశాలలో సూచిక బోర్డులు ఏర్పాటు, సాయంత్రం సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ధనోర(బీ), ఏమయికుంట, పులిమడుగు, పెర్కగూడ, శాంపూర్, పొన్నారి, కుచులాపూర్, హస్నాపూర్(ఖోడద్), ఆదిలాబాద్ పట్టణంలో కలెక్టర్ చౌక్, గర్ల్స్ హై స్కూల్, రిమ్స్, ఆర్టీసీ బస్టాండ్, రామాయి, చందా, రాంనగర్ హనుమాన్ టెంపుల్, మావల బస్టాండ్, తిరుమల పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో పర్యవేక్షించి ప్రపోజల్ పంపించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

బ్లూ కోల్ట్స్ పెట్రోకార్ విధులు నిర్వహించిన మహిళా పోలీసులు

భైంసాటౌన్: వాహనాలను తనిఖీ చేస్తున్న మహిళ బ్లూ కోల్ట్స్ పెట్రోకార్ మహిళా సిబ్బంది

సోన్/సారంగాపూర్/లక్ష్మణచాంద/నర్సాపూర్(జీ)/భైంసా/భైంసాటౌన్/కుంటాల/ముథోల్/బాసర/దస్తురాబాద్/కడెం/ఖానాపూర్, మార్చి 6: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు గురువారం నిర్మల్ జిల్లా వ్యాప్తంగా మహిళా కానిస్టేబుళ్లకు ముఖ్యమైన బ్లూ కోల్ట్స్, పెట్రోకార్ విధులను అప్పగించారు. వీరు వాహనాల తనిఖీతో పాటు డయల్ 100 కాల్‌కు హాజరవుతారు. ఈ సంద ర్భంగా మహిళా కానిస్టేబుల్స్ బ్లూ కోల్ట్స్ బాధ్యతలు అప్పగించినందుకు ఎస్పీకి ధన్యవాదాలు తెలిపారు.

మూడు ఎద్దులు చోరీ

తానూర్, మార్చి 6 : నిర్మల్ జిల్లా తానూర్ మండలం హిప్నెల్లితండాలో రైతు జాదవ్ తాన్‌సింగ్‌కు చెందిన మూడు ఎద్దులు బుధవారం రాత్రి తానూర్ పెట్రోల్ బంక్ సమీపంలో కట్టేసి ఉంచాడు. గురువారం ఉదయం కట్టేసిన ప్రాంతంలో రైతు చూడగా మూడు ఎద్దులు కనబడలేదు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఈ విషయంలో పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ ష్యాముల్‌కు వివరణ అడగగా ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు. దొంగలించిన మూడు ఎద్దుల విలువ రూ.లక్ష ఉంటుందని రైతు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ముథోల్, మార్చి 6 : నిర్మల్ జిల్లా భైంసా నుంచి ముథోల్‌కు అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను గురువారం పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామని సీఐ మల్లేశ్ తెలిపారు. వీటిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

క్రీడలతో ఉద్యోగాలు సాధించవచ్చు

ఉట్నూర్, మార్చి 6: క్రీడా పాఠశాలలో చదివి ఉద్యోగాలు సాధించవచ్చని ఉట్నూర్ ఐటీడీఏ ఏపీవో జనరల్ వసంత్‌రావ్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలోని క్రీడామైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల ప్రవేశ ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన బాలురకు ఈ నెల 10వ తేదీన ఉట్నూర్‌లోని కేబీ కాంప్లేక్స్ మైదానంలో, బాలికలకు ఈ నెల 12వ తేదీన ఆసిఫాబాద్ గిరిజన ఆదర్శ క్రీడా మైదానంలో జరిగే తుది ఎంపిక పోటీలకు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి పార్థసారథి, ఏటీడీవో క్రాంతి, పీడీలు జాదవ్ హేమంత్, లక్ష్మణ్, రవీందర్, శ్రీనివాస్, ప్రేమ్‌సింగ్, జయవంత్, మోహన్‌సింగ్, మండల వైద్యాధికారి సాయికృష్ణ, కోచ్‌లు సునంద్, శివకృష్ణ, శేఖర్, కార్తి, సాహుల్, సునీత, నిరంజన్, సురేందర్, సురేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్ల పిచికారీపై అవగాహన

తలమడుగు, మార్చి 6: తలమడుగు మండలంలోని లచ్చంపూర్ గ్రామంలో ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వ్యవసాయ పంటలలో డ్రోన్ల పిచికారీపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ కే రాజశేఖర్, డాక్టర్ జీ శివ మాట్లాడుతూ కూలీల కొరతను అధిగమించడానికి, యంత్రీకరణలో భాగంగా ఈ డ్రోన్ల పిచికారీ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తులతో ఆర్థిక స్వావలంబన

బోథ్, మార్చి 6: అటవీ ఉత్పత్తులతో ఆర్థిక స్వావలంబన సాధ్యమని జార్ఖండ్ ఎన్విరాన్మెంటల్ సొసైటీ చైర్మన్ దశరథ్ ఠాకూర్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం మర్లపల్లి గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో లక్క సేకరణపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్‌తో పాటు లక్క టెక్నీషియన్ రమేశ్‌చంద్ర మాట్లాడుతూ కేవలం వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగించడం కష్టమన్నారు. అందుబాటులో ఉన్న సహజ వనరులను కాపాడుకుని వాటి ద్వారా వచ్చే ఆదాయంతో అభివృద్ధి చెందాలన్నారు. మొదుగ చెట్లకు లక్కపురుగు పట్టడం ద్వారా వచ్చే లక్క చాలా విలువైందన్నారు. లక్క తీసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బోథ్ అటవీ రేంజ్ అధికారి ప్రణయ్, ఎఫ్ఎస్‌వోలు నాగోరావ్, ముంతాజ్, గోవింద్, జూనియర్ అసిస్టెంట్ పరశురాం, ఎఫ్‌బీవోలు సంధ్యా రాణి, ధన్‌రాజ్, అనిల్, నాగోరావ్, గిరిజనులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

తాంసి : బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌తో లింగూడ గ్రామస్తులు

తాంసి, మార్చి 6 : నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని లింగూడ గ్రామస్తులు నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను కలిసి కోరారు. గ్రామంలో రెండు బోర్లు, గ్రామం బయట ఉన్న బావి నుంచి పైపులైన్ వేయించాలన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇక్కడ మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్, భీంరావ్, సంజీవ్ ఉన్నారు.

శబరిమాత శివాలయ విగ్రహ పత్రిష్